# పంచకన్యలు

కమలాకర్‌కి గుండెలు దడదడలాడాయి. తనే పొరబడ్డాడా? చూడడం సరిగానే చూశాడే! నంబర్ సిక్స్ తనది. ఎందుకయినా మంచిదని టిక్కెట్టు జేబులో నుంచి తీసి చార్ట్ దగ్గరకు వెళ్లాడు. తన పేరెదుటే. తన టిక్కెట్టు నంబరుంది. సిక్స్. మరి ఆడవాళ్ల 'బే'లో ఉంది. అడామగా తేడా రైల్వే దృష్టిలో పోయిందేమో! లోపలకి వెళ్లి తన బ్రీఫ్‌కేస్ తన క్యారియర్ వగైరా లోపలపెట్టి సామాను ఎవరూ దింపుకుని పోకుండా గేటు దగ్గరే నిలబడ్డాడు.

–కండక్టర్ బోగీ దగ్గరకు రాగానే టిక్కెట్లు తీసి చూపించాడు. ''నంబర్‌సిక్స్ సార్!''

''మరి లేడీస్ బేలో ఇచ్చారేం?''

''అదేం లేదు సార్. మీరు సిక్స్ ఆక్యుపై చెయ్యండి.''

–రైలు కదలడానికి ఇంకా ఓ ఐదునిముషాలుంది. బిలబిలా ఆడపిల్లలో పదిమంది ఛార్ట్ దగ్గరకొచ్చారు. నంబర్లు వెదికారు... అంతా లేడీస్ బేలో జొరబడ్డారు.

''నమస్కారం సార్!'' అంది ఏం చెయ్యాలో తోచక బే ప్రాంతంలో తచ్చాడుతున్న కమలాకర్‌తో ఓ అమ్మాయి. బొద్దుగా, ఎర్రగా బంతి పువ్వులా ఉంది.

''నమస్తే! మీరు... రాజు మరదలు కదూ!''

''కాదండీ! మీరు. మా కాలేజీలో... పొదుపు గురించి మాటాడడానికి వచ్చారు కదూ! మా ప్రిన్సిపాల్ గారు...''

''అవునవును!'' ఆ అమ్మాయి ఇంకేమంటుందోనని కమలాకర్ చాలా కంగారుపడిపోయాడు. అతని ముఖం ఎర్రగా అయిపోయింది. తను తరచు కాలేజీకి వెళ్లతాడు... సుశీల గురించి... అదే వాళ్ల ప్రిన్సిపాల్ గురించి వీళ్లకి... కమలాకర్ దూరంగా వెళ్లాడు.

''నమస్కారం సార్!'' ప్లాట్‌ఫారమ్ మీద ఒకతను.

''నువ్వెవరు బాబూ!''

''ప్రిన్సిపాల్ ఆఫీసులో అటెండర్ని... మీరు అమ్మగారికోసం...''

'' ఆ ఁ!... ఎవరీ అమ్మాయిలంతా?''

''క్యాంపుకు వెళుతున్నారు బాబూ! హైదరాబాదు...''

'' ఇలా లెక్చరర్ ఎవరినీ సాయం లేకుండా పంపిస్తున్నారా మీ అమ్మగారు...''

''బాబూ తమకి తెలియందేముంది? ఫండ్స్... ఫండ్స్ లేవట... నన్ను స్టేషన్ వరకూదిగబెట్టి రమ్మన్నారు...''

కమలాకర్‌కి ధైర్యం వచ్చింది.

''సుశీలతో చెప్పు... అమ్మాయిల్ని నే చూసుకుంటాలే... అయినా బాధ్యత గల మనిషినెవరినీ సాయం పంపకుండా ఈ రోజుల్లో ఆడపిల్లల్ని... సరే నే చూసుకుంటాలే... అవతల ప్లాట్‌ఫారం మీద మన ఊరికి రైలుంది. నువ్వెళ్లు...''

'థాంక్స్ సార్! వాళ్లతో ఓ మారు చెప్పి వెళతా!'' రైలు కదలకుండానే ఎటెండర్ వెళ్లిపోయాడు.

మరికొద్దిసేపట్లో రైలు బయలుదేరింది రాత్రి తొమ్మిదవుతుండగా అప్పటివరకూ మూర్తి పక్కనున్న కమలాకర్ లేచాడు.

ముసిముసి నవ్వులు నవ్వుతూ మూర్తి ''తలుపులు జాగ్రత్త !'' అంటూ కమలాకర్‌తో చమత్కరించాడు.

ఐదుగురు కన్యలు మధ్య అవివాహితుడు – కమలాకర్ గుండెలో గుబులు.

చేస్తున్నది పెద్ద ఉద్యోగం. బాధ్యత బరువు. పైగా ఆ ఆడపిల్లలందరికీ తన సుశీలకి మధ్య ఉన్న స్నేహం తెలుసు. పంచకన్యలలోనూ ఏ ఒక్కరైనా కెవ్వున కేకవేసి తనమీద అత్యాచారం చేశాడన్న అభాండం వేస్తే ?

అది సుశీల వరకూ వెళితే ?

గుండె దడదడలాడింది.

స్లయిడింగ్ డోరు తెరిచేముందు అద్దంలోనుంచి లోపలకి చూశాడు.

ఓ అమ్మాయి పెదాలకు రంగు రాసుకుంటోంది.

ఓ అమ్మాయి మరొకామె ఒడిలో తలపెట్టుకుని డైరీ చూసి ఏదో పాట పాడుతోంది.

తన బెర్త్ దగ్గరకు వెళ్లాలా, వద్దా ?

నాకేం ఉద్యోగస్తుడ్ని. ఐదుగురు ఆడపిల్లల మధ్య పడుకోమని రైల్వే వాళ్లు నాకు చోటు అక్కడ చూపించారు.

వీళ్ల ప్రిన్సిపాలే తన స్నేహితురాలై ఉండగా వీళ్ల దగ్గర తనకు భయమెందుకు !

తలుపుమీద ఒకసారి టాప్ చేసి స్లయిడింగ్ డోర్ పక్కకు నెట్టి లోపలకెళ్లాడు.

లిప్‌స్టిక్ అమ్మాయి కంగారుగా హ్యాండ్‌బ్యాగ్ తెరచి చేతిలోని స్టిక్ దాచేసింది.

పడుకున్న అమ్మాయిలేచి కూచుంది.

'' మీరు .... మీరు భోజనం అవీ ....''

అందరినీ ఉద్దేశించే అన్నాడు కమలాకర్.

'' భోజనం రైల్లోకి తెప్పించుకుందామే! నాన్‌వెజ్ దొరుకుతుందిగా ....'' అంది ఓఅమ్మాయి.

'' నీళ్లో ? అరెరె! బకెట్లు, మగ్గులూ ఉన్నాయి. కాని నీళ్లు తెచ్చుకోడం మరిచిపోయాం!''

''పారలూ, గునపాలూ, బొరిగెలూ తెచ్చాం.... గమేలా లయితే జ్ఞాపకం ఉన్నాయి కాని బొత్తిగా మంచినీళ్లే మరిచిపోయాం సుమా !''

ఒకరూ ఒకరూ అంటుంటే కమలాకర్ అన్నాడు. '' నాబాటిల్‌లో నీళ్లున్నాయి... కావలిస్తే...''

– కమలాకర్‌కి క్యారియర్ తియ్యడానికి మొగమాటం వేసింది.

ఆకలి నకనకలాడుతోంది. వెధవ రైలు, కూచోగానే ఆకలి... నిద్ర.... వాళ్ల మధ్య నుంచి క్యారియర్ తీసుకుని బయటకు వెళ్లిపోతే !

కొంచెం ధైర్యం చేశాడు. ధైర్యం తనది కాదు ఆకలిది. ''నేను బయటకు వెళ్లి భోజనం చేసి వస్తా !'' క్యారియర్‌తో బయటపడ్డాడు.

క్యారియర్ ఖాళీచేసి కడిగేసి లోపలకు తీసుకొచ్చాడు.

'' నే సిగ్గరెట్టు కాల్చనులెండి ! మీకు ఇబ్బందేమో !'' ఆడపిల్లలు ఏవేవో గుసగుసలు. ముసిముసి నవ్వులు. తను లోపలకు రాగానే గప్‌చుప్.

'' మీకు అభ్యంతరం లేకపోతే నేను మీద పడుకుంటా!''

"అబ్బే ! మాకెందుకండీ అభ్యంతరం ,,,, మీ దెలానూ సిక్స్ – మీదనే కదా ... "

పళ్లు బిగబట్టి నవ్వు ఆపుకుంటున్నారు ముఖ్యంగా ఇద్దరమ్మాయిలు.

" మీకు ... ఏమండీ మీకు ... "

" ఏమిటే ఆ సణుగుడు ? అయనకు ఏమిటి ?" మరో అమ్మాయి ప్రాంప్ట్ చేసింది.

" ఏంలేదులేవే ... సారీ సర్. మీరు మీదకే వెళ్లిపోండి ! ఈ రాక్షసులకు నిద్రరాదు. ఏదో వాగుతూ ఉంటారు. ఇల్లుకదిలి ఎరగరేమో మహా హుషారుగా ఉన్నారు. మరేమీ అనుకోకండి!" పెద్దమనిషి తరహాగా ఉన్న అమ్మాయి అనేసి సీటు వెనక్కి జారగిలబడి కళ్లు మూసుకుంది.

వాళ్లని బొత్తిగా చిన్నపిల్లలుగా ట్రీట్ చేసి ఇగ్నోర్ చెయ్యడం ఆ క్షణంలో తనకి తోచిన ఒకే ఒక మార్గం.

– మీద కెళ్లి తలగడలో గాలి ఊదుకుని పడుకున్నాడు కమలాకర్.

కళ్లయితే మూసుకున్నాడు కాని కంటిమీదకి కునుకు రావడంలేదు. రైలు చూస్తే వచ్చే నిద్ర. ఈ రోజు ఏమిటీ వింత ?

వాళ్ల థ్రిల్ చూసి తనకూ మతిపోయిందా ? తను అసలు ఎందుకు బాధ్యత తీసుకున్నట్టు ? వాళ్లెవరో తనకు తెలియదు. వాళ్లెలా పోతే తనకేం ?

అలాగనే ఊరుకోలేకపోతున్నాడేం ?

" --అమ్మాయ్ !" మీదనుంచి ఓ అమ్మాయిని పిలిచి " గొలుసులూ అవీ జాగ్రత్త ! చెయిన్ స్నాచింగ్ చాలా జోరు ఈ సెక్షన్‌లో ..... అసలు మీరు బయటకు వెళ్లవద్దు.... ఏమైనా కావలిస్తే నే తెచ్చి ఇస్తా .... డోర్ లాక్ చేసెయ్యండి ."

" పడుకోండి సార్ ! మాకేం భయం లేదు !" దుబ్బుగా ఉన్న అమ్మాయి అంది.

ఎందుకో ఆ అమ్మాయంటే ఇంత వయసున్న కమలాకర్‌కే కొంచెం భయంలాంటిది కలిగింది.

కమలాకర్ కి ఎప్పుడు నిద్రపట్టిందో ....

రైలు స్టేషన్‌లో ఆగి ఉంది ;

--" మీకు పాటలు వచ్చా ? " ఓ పురుష కంఠం .

" నే విన్నా ... రాజీగారు చాలా బాగా పాడతారు. ఓ చిన్న పాట .... సెలక్షన్ మీ ఇష్టమే..." మరొక మగగొంతు.

ఐదుగురు ఆడపిల్లలూ ఒకే బెర్త్ మీద కూచున్నారు.

తను పడుకున్న బెర్త్ క్రింద సీటులో ఇద్దరు స్టూడెంట్స్.

ఎవరు వీళ్లు ? ఇంత తొందరగా వీళ్లతో స్నేహం ఎలా కుదిరింది ?

ముందే ప్లాన్ వేసుకుని అంతా కలిసే బయల్దేరారా ? రోజులు మారిపోయాయి.

అరిటాకు ముల్లుమీద పడ్డా – ముల్లు అరిటాకు మీద పడ్డా ఎప్పుడయినా చిరిగి పోయేది అరిటాకే.

" మీరు బి. ఈడి కాలేజీలో ఉన్నారు కదూ !" ఓ అమ్మాయి అడిగింది.

" అఁ !.... స్వతంత్ర్యం వచ్చినా బానిసత్వం మిగిలిపోయిన జేబులు ఈ ఉపాధ్యాయ శిక్షణా కళాశాలలే. వాళ్లయితే పకపకలూ వికవికలూ – మేం ఎవరితోనైనా మాట్లాడితే కళ్లెర్రచేసి

(తరువాయి 133 పేజి)

పరీక్షకన్నం పెట్టేయంటారు ... సగం అయింది లెండి ! కాలేజీ బయటకొచ్చాక చూడు నా సామిరంగా గోడలకెక్కించేస్తే... ఒక్క వెధవకీ పొట్ట చీల్చితే అక్షరంముక్కరాదు ... పైగా బడాయి... గొప్ప..పోజు.... గీర....''

'' అబ్బ ఊర్కోరా ! సుఖంగా ఉన్న సమయంలో ఈ గొడవెందుకు !''

-- కమలాకర్ వాళ్ల సుఖం అంతటితో ముగిస్తే మంచిదనిపించింది.

--''తరువాత స్టేషన్ ఏమిటీ ?''

'' అబ్బ! ఉండవే ... నీ సొద నీది ... టైమ్‌టేబిల్ ఒకటి కొని స్టేషన్ల జాబితాలో రేపు తెలికగా ఎక్కించుకో ?'' ఓ అమ్మాయి విసుక్కుంది.

ఇంతలో అబ్బాయి ఏం జోక్ వేశాడో ఏమో ఒకరిమీద ఒకరు పడి నవ్వుకుంటున్నారు.

సిగరెట్టు పొగ గుప్పుమంటోంది.

మరి కమలాకర్‌కి ఉండబట్టడం లేదు.

'' రజనీ గారు.. అగ్గిపుల్లల్తో ఓ ఆట చూపిస్తా ...'' పుల్లలు పేర్చి చూపిస్తున్నాడా అబ్బాయి.

మరొక జోక్ పేలిందేమో అందరూ గొల్లుమని నవ్వారు.

ఒకమ్మాయి తను కదలడం గమనించిందేమో ''ష్'' అంది.

స్లైడింగ్ డోర్ తెరుచుకుంది.

- కమలాకర్ క్రిందకు దిగాడు.

సీటువెనక్కి జేరగిలబడి కునికిపాట్లు పడుతుందో అమ్మాయి.

ఓ అమ్మాయి కిటికీలోంచి వెన్నెల్ని చూస్తోంది. చెక్కిలికి చెయ్యి చేర్చి మరీ.

కమలాకర్ బయటకి వచ్చాడు.

ఒకమ్మాయి గేటు దగ్గర నుంచుంది. '' జాగ్రత్త అమ్మాయ్ !'' అనకుండా వుండలేకపోయాడు కమలాకర్.

మరో ఇద్దరు అమ్మాయిలు ఏమైనట్టు ?

ఏమయితే తనకేం ?

అలాగని చూజాస్తూ ఒంటరిగా వెళుతున్న ఆడపిల్లల్ని అలా గాలికి వదిలెయ్యడం ... అందునా ఆ మగపిల్లలు ఎలాంటివాళ్లో ఏమో !

'' అమ్మాయ్ ! ఆ ఇద్దరూ ఏరి ?''

'' తెలియదండీ ! వెస్టిబ్యూలర్ కదా ....మరో పెట్టెలోకి వెళ్లి ఉంటారు.... మా అన్నయ్య బెజవాడలో స్టేషన్‌కు వస్తానన్నాడు. అందుకని నే మేలుకుని ఇలా నుంచున్నా ! ... '' ఆ అమ్మాయి చెప్పింది. ఎందుకో ఏమో అనుమానం కలుగుతుంది వీళ్లందరిమీదా ? నిజంగా వీళ్లు ...

కమలాకర్‌కి ఈ కన్యలందరినీ తెల్లారేవరకు ఎలా చూసుకోవాలా అనిపించింది.

లోపలకెళ్లి ఖాళీ సీటుమీద కూలబడ్డాడు.

'' అమ్మాయ్ ! నీ పేరేమిటి ?''

'' రజని'' - చందమామ నుంచి కళ్లు తిప్పకుండానే జవాబు చెప్పింది ఆ అమ్మాయి.

ముఖం వాచేటట్టు కుట్టడం వల్ల మాత్రమే అలా అవుతుందని కాంతమ్మకి తెలుసు. మరి తేనెటీగలు కారూ ? సూటి పోటి మాటలతో తననీ కొడుకునీ కుట్టడంలేదూ ?

రావ్‌జీ మనసులోనే బాధ పడుతున్నాడా ? ఏమయితేనేం తన ప్రతిభవల్ల కోడలికి పగ్గాలు వేయించగలిగింది. తమని ఇంట్లోంచి వాడు వెళ్లగొట్టలేడు. ముందొచ్చిన చెవులని వెనకొచ్చిన కొమ్ములు ఏం చెయ్యగలవ్ ?

ఎక్కడికి వెళ్లగలదు ఈ కోడలుపిల్ల ? వెళ్లిందో చచ్చిందే ! ఇంకా గొడవలు పెట్టడానికి బోల్డు అవకాశం వస్తుంది.

కాని తనబిడ్డ పార్వతి ఎలా ఉందో ? ఇద్దరు మగబిడ్డల తరువాత పుట్టిన లేక లేక కలిగిన ఆడపిల్ల.

ఎలా ఉందో, ఏం బాధపడుతుందో !

తనయి వెళ్లి చూసి రాలేదు. బస్‌స్టాప్‌లో ముక్కూ మొగమూ తెలియని ఊళ్లో తననీ, చిన్నాడినీ కుళ్లపొడిచారే ... నడుం నటుక్కుమని పోయింది... ఎలా వెళ్లడం ?

కట్నమయితే ఇవ్వలేదు కాని ఇల్లు గుల్లచేసి కూతురి కాపురానికి ఎంత పెట్టిందనీ ...

వెళ్లాలనే వుంది... కాని ఈసారి ప్రాణాలతో వదులుతారా ?

అయినా చిన్నాడి సంగతి అంతే ... పీకల మీదకి తెస్తాడు. ఆవేశంతో వళ్లూపై కనడు. చెల్లెలి కాపురం కోసం ప్రాణమైనా ఇస్తానని చేసినదేమిటి ?

చిటికెలో కాగితం రాసిపడేసి బావయ్య ఉద్యోగానికి ఎసేరు పెట్టేశాడే ! అవతలవాళ్లు కోడలిపిల్లలా చేతకానివాళ్లా పడి వుండడానికి ?

తన కూతుర్ని తను చూడకుండా వుండలేదు. చూడలేదు. ఉత్తరం ముక్కయినా రాయనివ్వడం లేదు అవతలవాళ్లు.

కూతురికి పెళ్లిచేస్తే అలా అయింది. కోడలొచ్చిన ముహూర్తాన్నయినా సంసారం కుదుటపడుతుందేమో ననుకుంటూ ఉంటే ....

ఇప్పటికే తనేమో ఇంటికి జేష్ఠ, పొరుక్కి శివాలక్ష్మి అయిపోయింది. ఎవరి నోటవిన్నా 'కాంతమ్మలాంటి మనిషి ఉందా !' అంటారు. కాని తనవాళ్ళందరికీ తను రాక్షసి ... తనతో ఎంతో చనువుగా తిరిగి పనులు చేయించుకున్న వాళ్లందరూ పైవాళ్లే ! ... వాళ్లు తన వెనక తన గయ్యాళితనాన్ని, మూర్ఖత్వాన్నీ చర్చించుకుని నవ్వుకుంటున్న విషయాలు కొద్ది కొద్దిగా బయటపడుతున్నాయి.

ఊళ్లోవాళ్ల మెహర్బానీ కోసం భర్తని కాదని స్నేహితులన్న వాళ్లందరికీ నానా చాకిరీ చేస్తోంది.... మంచికోసమే కదా !

కొడుకులకి నిజంగా తనంటే అసహ్యమా ? నిజంగా తను అంత చెడ్డ మనిషా ?

కోడలు ఎందుకు తనంటే భయపడిపోయింది ? నిజంగా ఇల్లు వదలి వెళ్లిపోయిందా ? నిముషంలో మరొక పెళ్లి చేసి కోడలుపిల్లను మరొకర్తెని తీసుకొస్తానని అనేసింది ! నిజంగా ఆ పని చెయ్యడం సాధ్యమే ? పనిమనిషి వచ్చి కోడలేదంటే ఏం చెప్పాలి ?

తనమాట చిన్నవాడు వినడు. పెద్దవాడు ఇంటిలోనుండి వేరు వెళ్లనివ్వడు. ఇంట్లో సుఖంగా

ఉండనూ ఉండనివ్వడు. ఈ కాలంలో పిల్లలే అంతేమో !

కిరణ్మయి చదువుకుందని అహంకారం ... అంతే కాదు తాము అల్లుడికి చేసిన అవమానం గురించి తెలిశాక కోడలిని సులువుగా తెచ్చేశాననే ఆనందం కాస్త తన దగ్గర నుంచి ఎగిరిపోయింది.

మూడు నెలల్లోనే ఆ అమ్మాయి మనసు విరిగిపోయిందా ? నిజమే - విరిగిపోవడంలో ఆశ్చర్యం లేదు.

మరేం చేతకాకపోయినా ఊచకోత పెట్టడం ఆ ముసలాడికి తెలుసు. తనా ఏమిటి - చదువూ సంధ్యా లేక పడివుండడానికి !

పుట్టి పెరిగి ఇరవయ్యేళ్లు వచ్చాక వేళ్లు సహితం పెకలించుకొని అత్తవారింట్లోకి వచ్చిన ఏ ఆడపిల్లకయినా తబ్బిబ్బు సహజమే.

కాని - " నీ తండ్రి వెధవ ... నీ తల్లికి మర్యాద తెలియదు. అల్లుణ్నెలా చూడాలో .. వియ్యాలవారిని ఎలా గౌరవించాలో తెలియని చదువుకున్న మూర్ఖులు ... డిగ్రీలయితే వున్నాయి కాని సంస్కారం మీ నాన్నకి లేదు ! " అని ఇంటిల్లిపాదీ మొహం మీద తిడుతూ వుంటే, ఒకరు తిడుతున్నప్పుడు ఇంకొకరు తాళం వేస్తూ ప్రతిచిన్న విషయంలోనూ పుట్టింటివారిని దుయ్యబడుతూ వుంటే' డబ్బు మనుషులంటూ వుంటే ఏ ఆడపిల్లయినా ఎలా పడివుండగలదు ?

ఇంతకీ వియ్యాలవారు చేసిన తప్పేమిటి !

ఈ మాట పిల్లలతో చెప్పి లాభం లేదు ... భర్తతో అందామా అంటే అవకాశమే ఇవ్వడు. అటు పక్క మనుషులు ఏం చేసినా, ఏం మాటాడినా ఏం రాసినా పెడర్థాలూ, విపరీతార్థాలూ తీసి ఊరికే నోరు పారేసుకుంటాడు. ఆయన అన్నదానికల్లా చిన్నవాడు వంతపాడతాడు. అగ్నికి ఆజ్యం తోడవుతుంది. చిచ్చు రగులుతుంది. చిన్న వాడికదే సంతోషం కాబోలు.

ఇంతకీ ఇంటిలో ఎవరూ తెలుసుకోలేకపోయినదేమిటంటే పెద్ద కోడలుగా ఆపిల్ల చేతిమీదుగా అన్నీ జరగాలి. ఇవాళ ఎందుకయితేనేం పడివుంటుంది. మరి నాలుగేళ్ల తరువాత.

ఏ ఆడపిల్లయితే మాత్రం తల్లినీ తండ్రినీ నిర్హేతుకంగా తూలనాడుతుంటే ఎన్నాళ్లని భరించగలదు ? అసలు ఇన్నాళ్లూ ఆ అమ్మాయి తట్టుకోగలగటమే వింత.

ఇల్లాంటిదేదో కొంప మునుగుతుందని తనకు ఎప్పుడో తెలుసు.

చిన్నవాడు తొణకకుండా నిండుకుండలా వున్న ఈ పిల్ల తల్లిదండ్రులనేం చెయ్యగలడు ?

ఇంతకీ ఇదంతా ఏదో శాపంలా ఉంది - స్వామీజీకి చెయ్యాల్సిన సేవలు చేసిందే ... అందుకేనా ఆయనకు తనమీద, తన సంసారం మీదా ఇంత కినుక ?

తన భర్త ఆయన వెనక అన్నమాటలు, తపస్సంపన్నులు, ఆయన చెవికి సోకాయా? భర్త ఎలాగూ మంచానపడి అనుభవిస్తూనే ఉన్నాడు.

ఇప్పటికే సంసారం గుట్టు రట్టయింది. ఇక తల ఎత్తుకుని ఎలా తిరగడం ?

వియ్యపురాలిని తనే అంది అనరాని మాటలు ... పెట్టుపోతలు ఆశించడం ఎంత నీచమైన పని ! ఇంటి గుమ్మం ఎక్కవద్దని అల్లుడు తెగవేసి చెప్తే వాళ్లు ఏం చెయ్యగలరు ?

తన బిడ్డని కొత్త కోడల్లో చూసుకుందామనుకుంటే కొంప తీసి ఏ నూతిలోనో దూకలేదు కదా....

పార్వతి... తన బిడ్డ తనుపుకొచ్చింది. ఏ క్షణాన్న దాని గురించి దుర్వార్త వినవలసి వస్తుందో అని అనుకుంటూ వుంటే ఇలా జరిగింది.

గుండె చెరువయిపోయింది.

" ఆవిడంతేలేరా! తండ్రిననీ, తల్లిననీ, తమ్ముడిననీ, అన్ననననీ... చెల్లెల్ననీ తొణకదు. ఎంత కవ్వించినా జవాబు చెప్పలేదు. ఎంత ధైర్యం? నువ్ కాబట్టి అలా పడివున్నావ్... నేనే అయితేనా చీల్చి చెండాడేవాణ్ని ... '' చిన్నాడు రొప్పుతున్నాడు.

కాంతమ్మ ఒళ్లు జరదరించి భయంతో గజగజలాడిపోయింది.

'' ఎవడితోనో లేచిపోతుందిరా నీచుడా... నువ్ మొదటినుంచీ కళ్లలో నిప్పులు పోసుకుంటూనే ఉన్నావు ...'' రావ్‌జీ మండిపడి పోయాడు.

'' వాడి మాటలు పట్టించుకోకురా పెద్దా... అన్నంటే వాడికి దైవసమానం ... ''

''అన్న! అన్న ఎవడు వీడికి ... అందరూ నాతో సహా దాన్ని చిత్రహింసలపాలు చేశాం.... నా పెళ్లాం ఎవడితోనో లేచి పోయిందంటాడా...'' పెద్దాడు తుపుక్కున ఉమ్మేశాడు.

''వాడిననకురా! వాడిది వెర్రి ఆవేశం...'' ముసలాయన ఉండబట్టలేకపోయాడు.

''చెల్లి ఊసుకాని, ఈ వెధవ మంచివాడని కాని మళ్లీ ఎప్పుడయినా నా దగ్గర అన్నాడో నే ఉరేసుకు చస్తా... పోతేపొండి... అభం శుభం తెలియని ఆడపిల్లని మీరు ఆడించమన్నట్టు ఆడించి ఈ స్థితికి తీసుకొచ్చాను.... మా మావ నా ఆత్మాభిమానం మీద దెబ్బ తీశాడన్నారే... మీరు ఆత్మాభిమానం వుంటే మరిక్కడ ఉండకండి! బయట చావండి. మీరూ నేనూ తిట్టినంత మాత్రాన – అవమానించినంత మాత్రాన అతగాడి పలుకుబడి తగ్గదు. ఆయన డిగ్రీలూ చెరిగిపోవు... ఇవాళ కాకపోతే రేపు ఆయనకు జరిగినదంతా తెలియకుండా పోదు. నాకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు... మీరు ఇల్లు వదలిపోవాలి... లేక నేనూ దానితోపాటు ఇల్లు వదలిపోవాలి... మానసికంగా నేనెప్పుడో చచ్చిపోయాను...''

రావ్‌జీ ఝుంఝూమారుతంలా లేచాడు.

సంతోషం చూడలేనట్టే పాపం ముసలాడు దుఃఖాన్నీ, ఆవేశాన్నీ – కామాన్నీ సంబాళించుకోలేడు – లేవబోయాడు. భార్య తన క్షేమం కోసం అర్చన చేయిస్తానంటే కోవెలకు వెళ్లేది వేరే మర్మంతో అని పెడార్థాలు తీస్తాడు ''నాకు గురువులూ, బాబాలూ, స్వాములూ – వీళ్ల మీద నమ్మకం లేదు. ఈ ముండ నాకోసం కాదు వెళుతుంట. దాని సొద దానిది. నువ్ గుమ్మం దిగడానికి వీల్లేదు... నాకు నడుం రాయి...'' అని నిలదీస్తాడు.

ముసలాడు సగం లేచి వెనక్కివాలిపోయాడు. కాని నోరు మాత్రం ధాటిగానే వుంది.

''అది కాదురా అబ్బాయ్! దానికి మొదటి నుంచీ నీమీద ఇష్టం లేదు. దాని తల్లీ తండ్రీ దాన్ని నీకు ఎలాగో కట్టేసి వదిలించేసుకున్నారు. అదే అలా అందని నువ్వే చెప్పావుగా... చదువుకున్న పిల్ల కావాలని పప్పులో కాలేశావ్. ఆదర్శాలన్నావ్, నిలబెట్టుకున్నావా! కట్నం తీసుకోనన్నావ్, మానేశావా? ప్రేమించి పెళ్లాడతానన్నావ్! నిన్నెవతయినా ప్రేమించిందా, ఒంటిపీక వెధవా! నన్ను పొమ్మనడానికి నీకెన్ని గుండెలు ?''

''మీరు ఊరుకుంటారా లేదా! మన బిడ్డని మనం ఏమనుకుంటే ఏం లాభం ?'' కాంతమ్మ వారించబోయింది.

''మరెవరినేనేదీ ? అది పోయిందిగా?''

'' ఊరుకోండి ! అదెక్కడికీ పోదు,,,, మన కుటుంబానికి వెలుగు తీసుకొస్తుంది...''

'' ఒసేయ్ కాంతం, నీ మనసులో వున్నది వేరు – నువ్ చెప్పేదీ వేరు – చేసేది మరొకటి ! నువ్ నోరు మూసుకో. ఎవరిని ఎలా లొంగదీయాలో నాకు తెలుసు...''

'' ఆ తెలుసు.... మీరేం తక్కువ మనుషులేమిటి ? మీ కుళ్లు బోతుతనం నా బిడ్డలకి డిగ్రీలు రాకుండా ఆపగలిగిందా–'' కాంతమ్మ ఉండబట్టలేక అనేసింది.

రావ్‌జీ కాస్త తమాయించుకున్నాడేమో మెల్లగా ప్రారంభించాడు. తనమీద తనకే జాలి – అసహ్యం రెండూ వేస్తున్నాయి.

''మీరు ఎప్పుడూ ఇలాగే – నువ్ జంతువ్వి అంటే నువ్ పశువ్వి అంటూ ఘర్షణ పడుతూ ఇక్కడే కాలక్షేపం చెయ్యడం ఇక కుదరదు... నా బ్రతుకు పాడైపోయింది. మొగుడూ పెళ్లాలని విడదీశారు... తలుపులు వేసుకుంటే వేసుకున్నామని ఏడిచారు. తీసి ఉంటే దాన్ని చిత్రహింసలు పెట్టి కుళ్లబొడిచారు.... పనిపాటలు రావన్నారు... చేతకానిదన్నారు. పొగరన్నారు. గర్వమన్నారు. మీకందరికీ జబ్బులున్నాయని దాన్నీ జబ్బు మనిషన్నారు.... ఆ చిన్న వెధవకి మనుషుల్ని బురదలోకి తొయ్యడమెలాగో తెలుసు. మంచిగా మాటలాడుతున్నట్టే మాటాడి మన సంగతి ఏమాత్రం తెలియని నా అత్తమామల మీద నానా రకాల మాటలూ పుట్టించాడు.... వాళ్లు ఆపేక్షతో, ఆదుర్దాతో, ఆవేశంతో రాసిన ఉత్తరాల్లో ప్రతి మాటకీ విపరీతార్థాలు తీసి, తర్జన భర్జనలు చేసి మా మనసులు విరిచేశాడు. తల్లి అంటే అసహ్యించుకునేటట్లు చెయ్యాలని ప్రయత్నం చేశారు. మనకయితే ఇలా కొట్టుకోడాలూ, రొప్పుకుంటూ రోజుకుంటూ బురదలో పందుల్లా ఒకరిమీద ఒకరు కేకలేసుకోడం అలవాటు ఎన్నాళ్లని సహిస్తుంది ? ఆలోచన కలది కాబట్టి ఇన్నాళ్లు నిభాయించుకుంది. తల్లికి ఉత్తరం ముక్క రాయకూడదని ఆంక్ష పెట్టినా, తండ్రి ఇంటికి వస్తే ముఖం కనపడనియ్యకూడదని శాసించినా ఊరుకుంది... ఇప్పుడేం చేస్తారో, ఏం చెయ్యమంటారో బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచించండి.

''నాకయితే జైలుకి పోవడమే తెలుసు. ఇంతకంటె ప్రశాంతంగానే వుంటుందక్కడ ! – మీరు కంటికి కనపడరు కాబట్టి. నా తప్పు నాకు తెలియడానికి అవకాశం లేకుండా – మనం చేస్తున్నవన్నీ ఘనకార్యాలనీ, మనంత గొప్పవాళ్లు ఎవరూ లేరని... మనకంటె తెలివయినవారెవరనీ నన్నిలా తయారుచేశారు. ఇక ఏమయినా చింత లేదు...''

గదిలోకి వెళ్లి తలుపు వేసుకొన్నాడు రావ్‌జీ.

'' ఒరేయ్ పెద్దాడా ! నీ తల్లిని, నీ కంటె ఎక్కువ బాధపడుతున్నదాన్ని. నే చెబుతున్నా విను. చిన్నదాని బ్రతుకు కొంతలో కొంత నిలబెట్టినవాడివి నువ్వు.... ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించరా! మనలో మనం కొట్టుకుని వీధిలో పడితే ఏం ప్రయోజనం... ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా ఏం చేస్తే బాగుంటుందో చూడు !''

కాంతమ్మ లబోదిబోమంది.

'' ఎక్కడికి వెళుతుందే వెర్రిబాగులదానా.... మనం ఇంట్లో ఉండడం ఇష్టంలేక మనల్ని పొమ్మనే ధైర్యమూ లేక, మొగుడూ, పెళ్లాం ఇలా నాటకమాడుతున్నారు... వాళ్లిద్దరూ ఎప్పుడూ ఒకటేనే'' ముసలాయన అందుకున్నాడు.

''అవును వాళ్లే నాటకమాడుతున్నారు... మీరేం తక్కువ వాళ్లా ! నన్ను నిముషం నమ్మకుండా... మగబుద్ధికి లోటు లేదు మీకు... మీ అనుమానం సంకటం మండిపోను !''

''కాదే కాంతం ! నిన్ను వదలి వుండలేక... ఎదురూ బొదురూ కూచుని నీతో మాటామంతీ ఆడుకుంటుంటే బాగుంటుందని... అయినా మనమిద్దరం వేరే పోవడమే మంచిది. వాళ్లూ మనమూ కూడా చిలకా గోరింకల్లా...''

''నోరు మూసుకోండి... మీ ముచ్చట మండినట్టుంది.''

హయగ్రీవరావ్‌కి ఈ సంభాషణ వినపడుతూనే వుంది. కోడలేమైపోయిందోనన్న ఆలోచనే లేదేం వీళ్లకి ! కిరణ్మయి నివురుగప్పిన నిప్పన్నమాట ! భగ్గుమంటే అందరినీ బుగ్గి చేస్తుంది.

ఇప్పుడెలా ! ఏం చెయ్యాలి ? ఎక్కడికి వెళ్లాలి ?

'' ఏం రా ! మమ్మల్ని పొమ్మంటావా ? ఇప్పుడే చెప్పు.... 'నా శవం మీద నుంచి వెళ్లండి!' అన్నావే... అది వెళ్లిపోయింది... మమ్మల్నీ పొమ్మంటే చెప్పు, ఇప్పుడే పోతాం ! ఒకటి మాత్రం నిజం... అది వాళ్ల వాళ్ల ఇంటికి వెళ్లడం జరగని పని....''

''మీరు ఊరుకోండి ! అసలు అదలా కట్టుగుడ్డలతో వెళ్లిపోయిందా ? ఏమయినా పెట్టెసర్దుకుని తీసుకుని వెళ్లిందా ?'' కాంతమ్మ అడిగింది.

లోపలనుంచి జవాబు లేదు.

తలుపు దబదబా బాదింది. తలుపుకేసి తల బాదుకుంది.

''డిగ్రీలూ, సర్టిఫికేట్లూ తీసుకెళ్లింది... అంతే నువ్ చేయించిన గొలుసూ, ఉంగరమూ ఇక్కడే వున్నాయి... ఇక నేను బ్రతికి ఉండడం దండగ !'' రావ్‌జీ భోరుమన్నాడు.

''అదేమిట్రా నీకేమిటి లోటు ! దానికి యోగ్యత లేకపోతే పోయింది...నీకు మరొకర్తి వస్తుంది'' చిన్నవాడు ధైర్యం చెప్పబోయాడు.

''నువ్ నోర్ముయ్ !''

''పోనీ వాళ్ల నాన్నకి టెలిగ్రాం ఇస్తే ?'' కాంతమ్మ అంది.

''నీ మొహంలా వుంది. ఆయన వెంటనే పోలీసు రిపోర్టు ఇస్తాడు... మనమంతా వ్యాన్ ఎక్కాల్సి వస్తుంది !'' రావ్‌జీ కంగారుగా లోపలనుంచి అరిచాడు.

కిరణ్మయి ఇలా ఎందుకు చేసింది ? తనని తను శిక్షించుకుంటూ తమందరినీ క్షమించిందా ? లేక తమనందరినీ శిక్షించడానికి ఇదొక్కటే మార్గమనుకుందా ?

ఎలా అయినా కిరణ్మయి కాంతిపుంజమే ! దానికి చీకటి అంటుకోదు. చీకటిని చీల్చడమే దాని లక్ష్యం ! లక్షణం.

తల ముణుకుల్లో పెట్టుకుని మంచంమీద కూలబడ్డాడు హయగ్రీయరావ్ !

**భారతి**

డిసెంబరు 1986